ఇంటర్ కాలేజీ అడ్మిషన్ల దందాపై చర్యలు చేపట్టాలి

● ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ

హైదరాబాద్ సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్పొరేట్ ఇంటర్ కాలేజీలు చేస్తున్న అడ్మిషన్ల దందాపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన విద్యా సంవత్సరానికి మరో రెండున్నర నెలల సమయం ఉన్నప్పటికీ, పేరొందిన కొన్ని విద్యాసంస్థలు ఇప్పటికే 90శాతానికి పైగా అడ్మిషన్లు పూర్తిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటర్ బోర్డు నియంత్రణ అధికారుల చేతుల్లో లేదన్న ఆమె, రెండు కార్పొరేటు విద్యాసంస్థల చేతుల్లో వారు కీలుబొమ్మలాగా మారి వంతపాడుతున్నారని ఆరోపించారు. ఒకే బ్రాంచ్‌పై వందలాది కళాశాలలు పెట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమంగా చేపట్టిన అడ్మిషన్లను రద్దు చేసి, ఇంటర్ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్లు చేపట్టి, ప్రతిభ కలిగిన విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. వీలైనంత త్వరగా ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఝాన్సీ కోరారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్‌కాలనీలో జరిగింది. ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ పాట్నా జిల్లా హల్సారీ గ్రామానికి చెందిన కమలేష్ కుమార్(28) 25 రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన ఆర్ఆర్‌కే వాటర్ సప్లయ్ సంస్థలో క్యాన్ల పంపిణీలో సహాయకుడిగా పనికి కుదిరాడు. రోజు మాదిరిగానే ప్లాంటు యజమాని తన కార్యాలయంలో నిద్రించే కమలేష్‌ను నీటి సప్లయ్ కోసం తీసుకెళ్లేందుకు తన ట్రాలీతో ఉదయం 7.15కు రాగా గదిలో ఉరి వేసుకొని కనిపించాడు. దీంతో అతడు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు విచారించగా మృతుడు బుధవారం రాత్రి 8.30కు తన బాబాయ్‌కి ఫోన్ చేసి ఉరి వేసుకొని చనిపోతున్నానని చెప్పినట్టు పోలీసులు గుర్తించారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఇతడు కుటుంబ సభ్యులతో గొడవ పడిననట్టు, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపారు.

యువకుడి వాహనాన్ని ఢీకొట్టిన ఆటో

యుసుఫ్‌గూడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై కోచింగ్‌కు వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి ఆటో వచ్చి ఢీ కొట్టింది. నల్గొండ జిల్లా త్రిపురారం సమీపంలోని రాగడప గ్రామానికి చెందిన షేక్ అర్షద్ అలీ కొంత కాలంగా యూసుఫ్‌గూడ పోలీస్‌లైన్‌లోని తన బావ సమీరుద్దీన్ వద్ద ఉంటూ అమీర్‌పేట మైత్రివనంలో కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈనెల 26వ తేదీ సాయంత్రం దిచక్ర వాహనంపై మైత్రివనం వైపు వెళ్తుండగా సిగ్నల్ సమీపంలో షేక్ అర్షద్‌అలీ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో అర్షద్‌అలీకి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అర్షద్ అలీ బావ సమీరుద్దీన్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగిపై దాడి

యుసుఫ్‌గూడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగిపై నలుగురు దుండగులు దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కొట్టం బాస్కర్ అనే వ్యక్తి జీటీఎస్ టెంపుల్ వద్ద ఉన్న విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్. ఈనెల 27న మధ్యాహ్నం ఉబర్ బైక్‌పై లంచ్ బాక్స్ వచ్చింది. అది తీసుకునేందుకు బయటకురాగా.. ఇంతలో నలుగురు వ్యక్తులు వచ్చి బాస్కర్ ఎవరని అడిగారు నేనే అని చెప్పేలోపే దాడి చేసి పిడిగుద్దులు గుప్పించి పారిపోయారు. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుషాయిగూడలో రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

ఏఎస్‌రావునగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం కుషాయిగూడలో జరిగింది. మహబూబాద్ జిల్లా కేసముద్రం గ్రామానికి చెందిన బండారు సూరయ్య(61) కుషాయిగూడ వాసవి శివనగర్‌లో నివాసం ఉండే తన కుమారుడు సౌందిత్ వద్దకు నాలుగు రోజుల క్రితం వచ్చాడు. కాగా ఉదయం కుషాయిగూడ డీ-మార్ట్ సమీపంలో రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన జీహెచ్ఎంసీ చెత్త సేకరణ ఆటో ట్రాలీ(టిఎస్08యుఏ7459) సూరయ్యను ఢీకొని వెళ్లిపోయింది. కిందపడిపోయిన సూరయ్యను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటి అనంతరం సూరయ్య మృతి చెందాడు. మొదటగా గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని కుమారుడు సౌందిత్ తెల్లవారు జామున వాకింగ్ కోసం బయటకు వెళ్లిన తన తండ్రి తిరిగి రాకపోవడంతో ఆయన స్థానికంగా వాకబుచేయగా రోడ్డు ప్రమాదం గురించి తెలిసింది. స్థానికులు గాయపడ్డ వ్యక్తి ఫోటోను ఫోన్‌లో చూపించడంతో అతడు తన తండ్రేనని నిర్ధారించుకుని కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దూలపల్లి రోడ్డులో యువకుడు..

జీడిమెట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడు కింపడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూలపల్లి రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. కొంపల్లి ప్రాంతంలోని అపర్ణ ఫామ్‌గ్రోస్‌లో నివాసముంటున్న అక్కినపల్లి ఆనంద్‌రెడ్డి, సువర్ణల రెండో కుమారుడు వంశీధర్‌రెడ్డి(24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి రాత్రి 11గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. వెనుక నుంచి వాహనం ఢీకొట్టడంతో కిందపడడంతో తలకు గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడే మృతి చెందాడు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం



సతీష్

హైదర్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'నా చావుకు ఎవరూ కారణం కాదు. నాకున్న ఇబ్బందులు వల్లే చనిపోతున్నా' అతని తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఉత్త రం రాసి పెట్టి ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన వాంచనాగిరి సతీష్(30) కేపీహెచ్‌బీ కాలనీలోని ఓహాస్టల్‌లో ఉంటూ ఓ మాల్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం షాప్‌కు వెళ్లి అక్కడినుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. హాస్టల్ రూంలో లేఖను గుర్తించిన స్నేహితులు సతీష్ తండ్రికి సమాచారం అందించారు. సతీష్ తండ్రి హైదరాబాద్ చేరుకుని స్నేహితుల వద్ద విచారించి కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెట్రోల్ బంక్‌లో తుపాకీతో హల్‌చల్

● ఇద్దరిని బంధించిన బంకు సిబ్బంది.. వారిలో ఒకరు పరారీ

చార్మినార్ మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ కోసం బంకుకు వచ్చిన ఇద్దరు హల్‌చల్ చేశారు. తుపాకీతో బెదిరించి చంపేస్తామని నానా హంగామా సృష్టించారు. ఈ ఘటన మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 7.50 గంటల ప్రాంతలో ఏతేబార్‌చౌక్ ప్రాంతంలో ఉన్న హైదరాబాద్ ఫిల్లింగ్‌స్టేషన్ పెట్రోల్‌బంక్‌కు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చారు. వారు క్యూలో రాకుండా అడ్డంగా వచ్చి పెట్రోల్ పోయాలని అడిగారు. అందుకు లైన్‌లో రావాలని సిబ్బంది చెప్పడంతో ఆగ్రహించిన ఇద్దరు వ్యక్తులు అక్కడే సమీపంలో ఉన్న రాడ్‌తో సిబ్బందిపై దాడికి యత్నించారు. వారిలో ఓ వ్యక్తి రివాల్వర్ తీసి పాయింట్ బ్లాక్‌లో పెట్టి చంపేస్తానని బెదిరించాడు. పెట్రోల్ బంకు సిబ్బంది వార్దిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తుండగా వారిలో ఓ వ్యక్తి తప్పించుకుని పారిపోయాడు. పెట్రోల్‌బంకు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఎంఎంటీఎస్ రైలు దిగుతూ గాయపడిన మహిళ మృతి

బర్కత్‌పుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న ఎంఎంటీఎస్ రైలు దిగుతూ గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌లో నివసిస్తున్న అనిత(28) ఈనెల 26వ తేదీన కర్నూలు నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. చందానగర్ కాకుండా పొరపాటున ఫలక్‌నుమా వెళ్లే ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. రైలులో ఉన్న ప్రయాణికులు చందానగర్ వెళ్లదని చెప్పడంతో కదులుతున్న రైలు దిగుతూ తీవ్రంగా గాయపడింది. ఆమెను రైల్వే పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంగళరావునగర్ కాలనీలో కానరాని శుభ్రత

● పట్టించుకోని అధికారులు, కార్పొరేటర్ ● ఇబ్బందుల్లో స్థానికులు



అయ్యప్ప మైదానం వద్ద వేసిన చెత్త





గుట్టలుగా పేరుకుపోయిన మట్టి వ్యర్థాలు

వెంగళరావునగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. అయ్య ప్ప మైదానం వద్ద ఒకవైపు మట్టి, వ్యర్థాలు గుట్టల్లా పేరుకుపోయాయి. ఇక్కడే స్థానికులు తమ ఇళ్లలోని వ్యర్థాలను వేస్తున్నారు. ఏ-బ్లాక్ పార్కు, నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద, డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం ఎదురుగా స్థానికులు వ్యర్థాలు పడేస్తున్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా స్థానిక కార్పొరేటర్, అధికారులు స్పందించడం లేదు. అయ్యప్ప మైదానం వద్ద ఒక వైపు మట్టి, వ్యర్థాలు గుట్టలుగా పెరుకుపోవడంతో రహదారి ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉదయం వీధులు ఊడ్చే పారిశు ధ్య కార్మికులు కూడా తాము ఊడ్చిన వ్యర్థాలను ఎత్తి ఇక్క డే పడేస్తున్నారు. కాలనీలోని పలు వీధుల్లో కొత్తగా రహదారులు నిర్మించడానికి అనుమతులు వచ్చినా నిధులు లేకపోవడంతో, రహదారిపై ఏర్పడ్డ గుంతలను తాత్కాలికంగా బీటీతో పూడ్చి వేశారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని, సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అధికారులను కోరారు.



ద్వారకాపురి కాలనీ ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

పంజాగుట్ట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట ప్రధాన రహదారి నుంచి ద్వారకాపురి కాలనీకి వెళ్లే మార్గంలో మోడల్ హౌస్ ఎదురుగా మ్యాన్‌హోల్ దెబ్బతిని రోజులు గడుస్తున్నది. సంబంధిత విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రహదారికి రెండు వైపులా వాహనాలను నిలుపుతుండడంతో తరుచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

'సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి'

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నేతలు కార్మికశాఖ రాష్ట్ర జాయింట్ కమిషనర్ చంద్రశేఖరానికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి వి.మధు మాట్లాడుతూ.. జీతాలు పెంచాలని ఏడాదిన్నర నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీలం మధు, గద్దల శ్రీను, మహేందర్, అరవింద్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలి



మంత్రి రాజనర్సింహకు వినపత్రం అందజేస్తున్న శివయ్య, మల్లేష్ తదితరులు

ఎర్రగడ్డ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్న అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలని తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోళ్ల శివయ్య, తెలంగాణ రాష్ట్ర దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేష్ గురువారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదరం రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో దాదాపు 24లక్షల ఎకరాల అసైన్‌మెంట్ భూములను 16 లక్షల కుటుంబాలకు అసైన్డ్ చేయడం జరిగిందని, దాదాపు 40, 50సంవత్సరాలు గడిచిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అన్ని కులాలకు ఇచ్చిన భూములకు సంపూర్ణ హక్కులు ఇంతవరకు కల్పించలేదని వారు పేర్కొన్నారు. ఈ విధంగా ఇతర రాష్ట్రాల అసైన్డ్ భూములకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి హక్కులు కల్పించాయన్నారు. అదే విధంగా తెలంగాణలో ఉన్న అసైన్‌మెంట్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లోక జనశక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బింగి రాములు, బీసీ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాసెట్టి నర్సింగ్ రావు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాగత నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యంగా..

● ఎన్ఈఎన్‌తో జేఎన్‌టీయూ అవగాహన ఒప్పందం



కార్యక్రమంలో జేఎన్‌టీయూ అధికారులు, ఎన్ఈఎన్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో వ్యవస్థాగత నైపుణ్యాలను అభివృద్ధి పరచడమే లక్ష్యంగా బెంగళూరుకు చెందిన నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నెట్‌వర్క్(ఎన్ఈఎన్) సంస్థతో జేఎన్‌టీయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జేఎన్టీయూలో చదువుతున్న విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి వారు సొంతంగా స్టార్టప్‌లను ప్రారంభించేలా తగిన శిక్షణను ఎన్ఈఎన్ అందించనుందని జే-హబ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీదేవి తెలిపారు. స్టార్టప్ కంపెనీని మార్కెట్‌లోకి ప్రవేశపెట్టడం, మార్కెట్‌కు అనుకూలంగా వారికి శిక్షణ ఇవ్వడం, ఎగుమతుల విషయంలో అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఎంఓయూ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ నరసింహారెడ్డి, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర రావు, మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ సింధు, అకడమిక్ అఫైర్స్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణ, ఆడిట్‌సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్న, ఎన్ఈఎన్ రీజనల్ డైరెక్టర్ సోనాలి అగ్నిహోత్రి, సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ అమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ కెరీర్‌కు 'ఇగ్నైట్' దోహదం



జే-హబ్‌లో ఇగ్నైట్ ప్రోగ్రామ్‌కు హాజరైన వివిధ కళాశాలల అధ్యాపకులు

హైదరాబాద్ సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించే నిమిత్తం వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులకు ఏర్పాటు చేసిన రెండ్రోజుల 'ఇగ్నైట్' సర్టిఫికెట్ ప్రోగ్రాం గురువారంతో ముగిసిందని జే-హబ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనుబంధ, అఫిలియేటెడ్ కళాశాలలకు చెందిన సుమారు 75 మంది అధ్యాపకులు పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు.

భారత దేశంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను కెరీర్ ఆపర్చునిటీగా మార్చాలన్న ఉద్దేశ్యంతో పని చేస్తున్న వాద్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇగ్నైట్ ప్రోగ్రాం విజయవంతంగా పూర్తయిందన్నారు. కళాశాలల్లోని విద్యార్థుల వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఈ సర్టిఫికెట్ ప్రోగ్రాం ఎంతో దోహదపడుతుందని డైరెక్టర్ శ్రీదేవి ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరాగాళ్ల మోసం

● రూ. 20 లక్షలకు రూ. 50 లక్షల లాభమంటూ టోకరా

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ యాక్సిస్ ఏజెన్సీ యాప్‌ను పోలిన యాప్ రూపొందించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.20.10 లక్షలు కాజేశారు. పలు సామాజిక మాధ్యమాల్లో పార్ట్‌టైం జాబ్ యాడ్స్ చూసిన సికింద్రాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు(88) వారిని సంప్రదించాడు. సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. వెబ్‌సైట్లు చూడటం, యూట్యూబ్ వీడియోలు చూడటం వీటిని స్క్రీన్‌షాట్‌లు తీసి పంపితే కొంతమొత్తంలో డబ్బులు ఖాతాలో జమచేసేవారు. బ్లాక్ ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించవచ్చని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. కొంత మొత్తం ఆదాయం రావడంతో సైబర్ నేరగాళ్ల మాటలపై నమ్మకం వచ్చి వారు పంపిన లింక్ ద్వారా యాక్సిస్ ఏజెన్సీ యాప్‌ను పోలిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అధిక మొత్తంలో లాభాలు అని చెప్పడంతో రూ.20.10 లక్షలు పెట్టుబడి పెట్టి వారు సూచించిన విధంగా టాస్క్‌లు పూర్తి చేశాడు. పెట్టుబడితో కలిపి మొత్తం రూ.50 లక్షలు తన ఖాతాలో ఉన్నట్టుగా యాప్‌లో చూపించడంతో డబ్బు విత్‌డ్రా చేయాలనుకున్నాడు. నిర్వాహకులను సంప్రదించగా డబ్బు విత్‌డ్రా చేయాలంటే ఖాతాలో మొత్తానికి 30 శాతం అంటే రూ.15 లక్షలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ నిధికి డొనేషన్ చేయాలని సూచించారు. దాంతో అనుమానం వచ్చిన బాధితుడు బేగంపేటలోని యాక్సిస్ బ్యాంకు కార్యాలయంలో సంప్రదించగా, సైబర్ నేరగాళ్ల మోసం వెలుగులోకి వచ్చింది. దాంతో తనకు న్యాయం చేయాలని బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కైలాసం ఆటతో ఓటుపై అవగాహన



ఓటుపై అవగాహన కల్పిస్తూ చింతలబస్తీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో వైకుంఠపాళి ఆడిస్తున్న నోడల్ అధికారులు

ఖైరతాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత.. ఎన్నికల్లో నిర్భయంగా ఇష్టం వచ్చిన వారికి ఓటు వేయాలి.. ఓటరు జాబితాలో పేర్లను సరిచూసుకొని, లేకపోతే వెంటనే అర్హులైన వారు నమోదు చేసుకోవాలి. అంటూ జీహెచ్ఎంసీ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోజ్ సూచనల మేరకు వినూత్న పద్ధతుల ద్వారా ఓటరు చైతన్యాన్ని కల్పించడంలో భాగంగా సర్కిల్ 18ఉప కమిషనర్ ప్రశాంతి ఆధ్వర్యంలో నోడల్ అధికారులు చింతలబస్తీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు, ఎన్‌బీటీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కైలాసం (వైకుంఠపాళి) ఆడించి ఓటుపై వగాహన కల్పించారు. ఈఆటలో పాచిక వేయడం ద్వారా ముందుకు వెళ్లే క్రమంలో ఓటర్లు చేయాల్సిన పనులతో ఉన్న గడుల్లో నిచ్చెనలు, చేయకూడని పనుల కొటేషన్లు ఉన్న గడుల్లో పాములను ఉంచారు. చేయాల్సిన పని ఉన్న చోట నిచ్చెనతో పైకి వెళ్లేలా, చేయకూడని పని ఉన్న చోట ఉన్న పాము మింగితే తోక వద్దకు వచ్చేలా చేసిన ఆటతో విద్యార్థులు సరదాగా ఓటరు అవగాహన పొందారు. ముందు పైకి వెళ్లిన వారిని విజేతగా ప్రకటిస్తారు. పాఠశాల విద్యార్థులకు తమ తల్లిదండ్రులకు ఓటరు అవగాహన కల్పించేలా వారికి పలు అంశాలను తెలియజేశారు. ఇందులో ఎన్నికల నోడల్ అధికారిణి ఆశ, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు, సిబ్బంది

పంజాగుట్ట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జీటీఎస్ కాలనీలోని వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప సహిత సాయిబాబా ఆలయంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడు నెలలకు గాను మొత్తం రూ. 1.94 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ ఈఓ సత్యనారాయణ, ఆలయ ఈఓ జయరామయ్య, కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిన ఆకులతో సాయిల్ కండిషనర్!

● మ్యాపిల్ టౌన్ విల్లాస్‌లో తయారీ ● పరిశీలించిన కమిషనర్

హైదరాబాద్ సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని మ్యాపిల్ టౌన్ విల్లాస్‌లో అధునాతన విధానంలో సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టారు. యాక్సిలరేటెడ్ ఎనరోబిక్ కంపోస్టింగ్ విధానంలో ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటుచేసి ఎండిన ఆకులను అధిక పోషకాలు ఉన్న సాయిల్ కండిషనర్ (ఆర్గానిక్ ఎరువు)గా తయారుచేస్తున్నారు. ఇందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) హైదరాబాద్, సీఎస్ఐఆర్ సాంకేతిక సహకారమందిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీలోని చెట్ల నుంచి రాలిన ఆకులను ప్లాంట్ ద్వారా ఎరువుగా మారుస్తున్నారు. నెలకు సుమారు 10 టన్నుల సాయిల్ కండిషనర్ తయారు చేస్తున్నారు. ఈఎరువుకు మార్కెట్‌లోనూ భారీగా డిమాండ్ ఉంది. ప్లాంట్‌ను గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ పరిశీలించారు. అదే గేటెడ్ కమూనిటీలో ఉన్న సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌నూ సందర్శించారు. మ్యాపిల్‌టౌన్ యజమానులు, సీఎస్ఐఆర్, ఐఐసీటీ కృషిని కమిషనర్ అభినందించారు. ఇతర గేటెడ్ కమ్యూనిటీలూ ఈ తరహా ఏర్పాట్లకు ముందుకు రావాలని కోరారు.



సికింద్రాబాద్‌లో మిలటరీ డెంటల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేజర్ జనరల్ రాకేష్‌మనోచా, మిలటరీ అధికారులు

సాయుధ దళాలకు ఆధునిక చికిత్స

అల్వాల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాలకు ఆధునిక వైద్య సేవలను అందించడానికి సికింద్రాబాద్‌లో నూతనంగా నిర్మించిన డెంటల్‌సెంటర్ ఎంతో దోహదపడుతుందని తెలంగాణ, ఆంధ్రా సబ్‌ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్‌మనోచా అన్నారు. గురువారం ఆయన ఆర్మీ సీనియర్ అధికారులతో కలిసి డెంటల్‌సెంటర్‌ను ప్రారంభించారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన ఈ భవనంలో 8మంది డెంటల్ ట్రీట్‌మెంట్ సిబ్బందితో పాటు శస్త్రచికిత్సలను నిర్వహించే నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. దంత వైద్యులు, ఆర్మీఅధికారులు, మాజీ అధికారులు పాల్గొన్నారు.

పేట్లబురుజు ఆస్పత్రిలో ఆర్‌వో ప్లాంట్

చార్మినార్ మార్చి 28(ఆంధ్రజ్యోతి): రోగులతోపాటు వారి సహాయకులు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌వో ప్లాంటును అందుబాటులోకి తీసుకొచ్చారు. పేట్లబురుజు ఆస్పత్రిలో ఆర్‌వో ప్లాంట్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ రజనీరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేట్లబురుజు ఆస్పత్రిలో రోగులకు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సదుపాయాలు కల్పిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వేసవిలో రోగులు, వారి సహాయకులకు తాగునీటి ఇబ్బందులు కలుగకూడదని ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, పీహెచ్‌నే డాక్టర్ అండాలు, ఆర్ఎంవోలు చంద్రప్రకాష్‌జైన్, అమృతలక్ష్మి పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన

● జవహర్‌నగర్ మేయర్, కార్పొరేటర్లపై కేసు

జవహర్‌నగర్, మార్చి, 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన జవహర్‌నగర్ మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లపై జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 27న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పింఛన్లు పంచడం, మున్సిపల్ కార్పొరేషన్‌వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. వాటికి సంబంధించిన ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పాటు తెలుగు యువత రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జవహర్‌నగర్ పోలీసులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మేయర్ శాంతి కోటేశ్‌గౌడ్‌తో పాటు డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్‌లు శారద, లావణ్య, నాగరాణి, పల్లపురవి, ప్రేమలక్ష్మీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపారు.

'ఉద్యమకారులను ఆదుకోవాలి'

రామంతాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదుకోవాలని తెలంగాణ మలిదశ తొలి ఉద్యమకారుడు, కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అక్రమంగా కబ్జా చేసిన భూములు సంపాదించిన సొమ్మును ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని, ఇల్లు కట్టుకునేందుకు రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. No. 140 / 2023
బిట్వీన్:
కోట కృష్ణప్రకాష్ @ చిన్ని ...పిటీషనరు
మరియు
కోట హరిత @ మకుల హరిత @ హరి & వగైరా
To: ...రెస్పాండెంటు
2వ రెస్పాండెంటు అయిన Anumula Rajsekhar S/o. Not Known, Principal I.I.T. Campus # 279/3RT, Narayana College, Opp. Andhra Bank Lane, S.R. Nagar, Hyderabad - 500038. Telangana State.
వారికి పై నెంబరు H.M.O.P. 140 / 2023 నందు నోటీసు నిమిత్తం ది. 12-04-2024 నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : ది. 12-04-2024
ఇట్లు : లంకిశెట్టి బాలాజీ
పిటీషనరు తరఫున అడ్వకేట్, మచిలీపట్నం.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



ఇఫ్తార్ విందులో శ్రీగణేష్, ముస్లింలు

బొల్లారంలో ఇఫ్తార్ విందు

తిరుమలగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని 8వ వార్డు బొల్లారంలో మజీద్ అల్ హబీబ్‌చరం దర్గాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీగణేష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, ఆయాద్ భాయ్, హఫీస్ ఉద్దీన్, సయ్యద్ అంజద్, సయ్యద్ అస్లం, సయ్యద్ జావిద్, మహ్మద్ యూనిస్, సయ్యద్ పాల్గొన్నారు.

బోయినపల్లిలో...

బోయినపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌ను పురస్కరించుకుని ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. గురువారం సాయంత్రం బోయినపల్లిలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి పాల్గొని ముస్లింలకు పండ్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల్ బాబా, హసీన్ ఖాన్, రిజ్వాన్, ఖదీర్, ముక్తార్ పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

బౌద్ధనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వీధి దీపా లు పగలే వెలుగుతున్నాయి. అధికారుల నిర్వాహణ లోపంతో వారం రోజులుగా వారాసిగూడ కౌసర్ మసీదు రోడ్డులో వీధి దీపాలు వెలుగుతున్నాయని అధికారులు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవటంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలకు టైమర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి శిక్ష

తిరుమలగిరి మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వ్యక్తులకు న్యాయస్థానం శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ 11 మంది పట్టుబడ్డారు. కొందరికి జరిమానా, మరికొందరికి రెండు రోజుల జైలు, జరిమానా కోర్టు విధించిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



డాక్టర్ సారాను సన్మానిస్తున్న కళాజ్యోతి, తదితరులు

డాక్టర్ సారాకు సన్మానం

అడ్డగుట్ట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సెవెన్ రేస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ సారాకు తెలంగాణ దివ్యాంగుల హక్కుల సాధన సమితి అధ్యక్షురాలు కళాజ్యోతి ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కళాజ్యోతి మాట్లాడుతూ నిరుపేదలకు ఆర్థిక సాయం, పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, దివ్యాంగులకు అండగా నిలిచిన డాక్టర్ సారా సేవలు మరువలేమన్నారు.



సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేస్తున్న శ్రీగణేష్

సాయిబాబా ఆలయంలో అన్నదానం

మారేడుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లిలో ప్రసిద్ధి చెందిన సాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబాకు కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీగణేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రధాన కూడళ్లలో వాహనదారులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కంటోన్మెంట్ నుంచి పోటీ చేస్తా

- **బీజేపీ అధిష్ఠానానికి విజయ్‌కుమార్ వినతి**

సికింద్రాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో జరిగే ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్ఠానానికి బీజేపీ సీనియర్ నాయకుడు తులసీరామ్ విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను కంటోన్మెంట్ సీటు కోసం ప్రయత్నించానని, అధిష్ఠానం వేరే అభ్యర్థికి చాన్స్ ఇచ్చిందన్నారు. ఉప ఎన్నికలో తనకు సీటు ఇస్తే విజయం సాధిస్తానని వెల్లడించారు.



వ్యక్తి అదృశ్యం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టలో పారాయణం చేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కూకట్‌పల్లికి చెందిన వెంకట బాల సుబ్రహ్మణ్యం(57) యాదగిరిగుట్టలో పారాయణ చేసేందుకు ఈ నెల 10న సాయంత్రం తన సోదరుడు బైకుపై సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కువరకు వచ్చాడు. పది రోజులు అవుతున్నా వెంకట బాల సుబ్రహ్మణ్యం నుంచి ఎలాంటి ఫోన్ రాకపోవడం, ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో సోదరి శ్రీదేవి యాదగిరిగుట్టకు వెళ్లి వాకబు చేసింది. వెంకట బాలసుబ్రహ్మణ్యం ఇక్కడికి రాలేదని యాదగిరిగుట్ట ఆలయ ప్రధాన అర్చకుడు చెప్పడంతో ఆమె గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బాల సుబ్రహ్మణ్యం

60 ఏళ్ల కాంగ్రెస్ పాలలో అన్నీ కుంభకోణాలే..

మోదీ పాలనలో ఒక్క అవినీతి లేదు

- **నన్ను గెలిపిస్తే ప్రభుత్వ హామీల అమలు కోసం కొట్లాడుతా**
- **కార్యకర్తల సమావేశంలో బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్**



ఎల్‌బీనగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మన్సూరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు భారత్‌ను థర్డ్ క్లాస్ దేశంగా ప్రపంచ దేశాలు చూసేవని, కానీ మోదీ పదేళ్ల పాలనలో ఆపద వస్తే పేద దేశాలను ఆదుకునేలా ప్రపంచంలో బలమైన ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం రాత్రి నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో 2జీ స్కాం, బొగ్గు గనుల స్కాం లాంటి లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయని, కానీ పదేళ్ల మోదీ పాలనలో ఒక్క కుంభకోణం లేదని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు భారత్‌కు రెడ్ కార్పేట్ వేసి స్వాగతం పలుకుతున్నాయన్నారు. 370 ఆర్టికల్ రద్దుతో జమ్మూకాశ్మీర్.. స్విట్జర్‌లాండ్‌లా అభివృద్ధి చెందుతుందన్నారు. లెఫ్టిస్టులు, రైటిస్టులు అందరూ తనకు ఎన్నికల్లో మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ప్రజల కోసం నిలబడి పని చేయటమే తన లక్ష్యమన్నారు. తనను గెలపిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం కొట్లాడుతానని, ఢిల్లీ నుంచి రాష్ట్రానికి రావాల్సిన అభివృద్ధి పనులను తీసుకువస్తానని ఈటల పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, పార్లమెంట్ ఇన్‌చార్జి గోలి మధుసూదన్, నాయకులు కర్నాకర్, ఆర్.కె.శ్రీనివాస్, కొత్త రవీందర్‌గౌడ్, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, రంగా నర్సింహగుప్తా, వెంకటేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో మాదిగల బలం చూపిస్తాం

- **ఎమ్మార్పీఎస్ నాయకులు**

బోయినపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరగబోయే ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టికెట్లను ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్రీకృష్ణ మాదిగ డిమాండ్ చేశాడు. లేదంటే మాదిగల బలం చూపిస్తామని హెచ్చరించారు. గురువారం బోయినపల్లి డైమండ్ పాయింట్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ 40 ఏళ్లుగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో మాదిగలు రాజకీయంగా అన్యాయానికి గురవుతున్నారు. కాబట్టి రాజకీయ అవకాశం, రాజకీయ న్యాయం అన్ని పార్టీలు చేయాలని, ప్రతి పార్టీ కూడా ఈ ఉప ఎన్నికల్లో మాదిగలకు మాత్రమే టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమించి కంటోన్మెంట్ ప్రాంత మాదిగలను చైతన్యం చేస్తూ మాదిగల బలగం చూపిస్తామని అన్నారు. వివిధ పార్టీలలో ఉన్న మాదిగ అభ్యర్థులు వారి వారి పార్టీల అధిష్ఠానానికి వినతిపత్రాలు సమర్పించాలన్నారు. కలిసి పోరాడాలని మాదిగ బలగం సంఘం నుంచి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



డైమండ్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంటోన్మెంట్ నియోజకవర్గంలో బోర్డు మాజీ సభ్యులు అందరూ కూడా వారు మా యొక్క న్యాయమైన డిమాండ్‌ను తప్పుదోవ పట్టించే విధంగా చేస్తున్నారని అన్నారు. మా న్యాయమైన రాజకీయ డిమాండ్లు ప్రతి పార్టీ స్వాగతించాలని అన్నారు. ఈ ఉప ఎన్నికతో పాటు పార్లమెంటు ఎన్నిక కూడా జరుగుతుంది. ఏడు నియోజకవర్గాలను కలుపుకొని మూడు లక్షల చిల్లర పైచిలుకు ఉన్నటువంటి ఎస్సీ ఓట్లను దృష్టిలో పెట్టుకొని మెజార్టీగా ఉన్నటువంటి మాదిగలకు ఈ ఉప ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ నియోజకవర్గంలో మాదిగలకే టికెట్ కేటాయించాలన్నారు.

కార్యక్రమంలో ఇటిక శ్రీకృష్ణమాదిగ, ఇటుక ఓపి మాదిగ, అజిత్ కళ్యాణ్, రొట్టెల సునీల్ మాదిగ, మధుకర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కస్టోడియన్ భూముల్లో ఆక్రమణల తొలగింపు

కాప్రా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాప్రాలోని ప్రభుత్వ కస్టోడియన్ భూముల్లో వెలిసిన ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. కాప్రాలోని 141, 153 తదితర సర్వే నెంబర్‌లో 70 ఎకరాల ప్రభుత్వ కస్టోడియన్ భూములు ఉన్నాయి. ఈ భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. ఫెన్సింగ్‌ను రేకులతో నిర్మించిన గదులను కూల్చి వేశారు. ప్రభుత్వ కస్టోడియన్ భూముల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

చలివేంద్రం ప్రారంభం

మచ్చబొల్లారం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు చాలా అవసరమని కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ బటన్‌గూడలో స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, పుట్నాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, శ్రీశైలం యాదవ్, నరేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కిట్టు, ఆనంద్, రమేష్, గోపాల్, ఆంజనేయులు, సాయికుమార్, గణేష్, సంపత్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్‌బీనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రసన్నాంజనేయస్వామికి శతఘటాభిషేకం నిర్వహించారు. అనంతరం సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు స్వర్ణ కిరీటధారణ చేశారు. అనంతరం సీతారామచంద్రస్వామి మూలమంత్ర సహిత మన్యుసూక్త హోమం నిర్వహించారు. జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య అనంత శ్రీవిభూషిత విద్యా శంకర భారతి మహాస్వామి కుంభాభిషేకం నిర్వహించారు.

అనంతరం భక్తులనుద్దేశించి శ్రీవిద్యాశంకర భారతి మహాస్వామి అనుగ్రహభాషణం చేశారు. సాయంత్రం సీతారామచంద్రస్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. రాత్రి ఆర్‌కేపురం వీధుల్లో కనుల పండువగా రథోత్సవం సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

కార్యక్రమంలో జగిని రమేష్, రాజుశ్రీవాత్సవ, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, ఎన్ఎస్‌యూఐ నాయకులు శివ, మహేందర్, శేఖర్, దుర్గప్రసాద్, శ్రీధర్, బాలరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీవిభూషిత విద్యా శంకర భారతి మహాస్వామి



కుషాయిగూడ శివసాయినగర్‌లో తడి-పొడి చెత్తను వేరు చేసేలా అవగాహన కల్పిస్తున్న కాప్రా పారిశుధ్య అధికారులు, సిబ్బంది

తడి, పొడి చెత్తను వేరు చేసేలా అవగాహన

కుషాయిగూడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో చెత్తను తడి-పొడిగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వడంతో పాటు చెత్తను ఇళ్ల బయట పారవేయకుండా చెత్త రహితంగా కాలనీని తీర్చిదిద్దుతామని ఆ కాలనీ వాసులు ప్రమాణం చేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ శివసాయినగర్‌లో గురువారం ఉదయం స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ పారిశుధ్య విభాగం అధికార సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు చెత్త నిర్వహణ విధానాలను వివరించారు.

సాయుధ దళాలకు ఆధునిక చికిత్స

అల్వాల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాలకు ఆధునిక వైద్య సేవలను అందించడానికి సికింద్రాబాద్‌లో నూతనంగా నిర్మించిన డెంటల్‌సెంటర్ ఎంతో దోహదపడుతుందని తెలంగాణ, ఆంధ్రా సబ్‌ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్‌మనోచా అన్నారు. గురువారం ఆయన ఆర్మీ సీనియర్ అధికారులతో కలిసి డెంటల్‌సెంటర్‌ను ప్రారంభించారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన ఈ భవనంలో 8మంది డెంటల్ ట్రీట్‌మెంట్ సిబ్బందితో పాటు శస్త్రచికిత్సలను నిర్వహించే నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. దంత వైద్యులు, ఆర్మీఅధికారులు, మాజీ అధికారులు పాల్గొన్నారు.

కుషాయిగూడలో రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

ఏఎస్‌రావునగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం కుషాయిగూడలో జరిగింది. మహబూబాద్ జిల్లా కేసముద్రం గ్రామానికి చెందిన బండారు సూరయ్య(61) కుషాయిగూడ వాసవి శివనగర్‌లో నివాసం ఉండే తన కుమారుడు సౌందిత్ వద్దకు నాలుగు రోజుల క్రితం వచ్చాడు. కాగా ఉదయం కుషాయిగూడ డీ-మార్ట్ సమీపంలో రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన జీహెచ్‌ఎంసీ చెత్త సేకరణ ఆటో ట్రాలీ(టిఎస్08యుఏ7459) సూరయ్యను ఢీకొని వెళ్లిపోయింది. కిందపడిపోయిన సూరయ్యను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటి అనంతరం సూరయ్య మృతి చెందాడు. మొదటగా గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని కుమారుడు సౌందిత్ తెల్లవారు జామున వాకింగ్ కోసం బయటకు వెళ్లిన తన తండ్రి తిరిగి రాకపోవడంతో ఆయన స్థానికంగా వాకబు చేయగా రోడ్డు ప్రమాదం గురించి తెలిసింది. స్థానికులు గాయపడ్డ వ్యక్తి ఫోటోను ఫోన్‌లో చూపించడంతో అతడు తన తండ్రేనని నిర్ధారించుకుని కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాసవీ మాతను పూజిస్తే అష్టైశ్వర్యాలు : మాధవా నంద సరస్వతి

రామంతాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వాసవీమాతను భక్తి శ్రద్ధలతో పూజిస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయని మాధవా నంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. రామంతాపూర్ శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ రాజ గోపురం ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

ఆర్యవైశ్య ఫెడరేషన్ అంతర్జాతీయ అధ్యక్షుడు గంజి రాజమౌళి గుప్త, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశం గుప్త, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గుప్త, కొండయ్య గుప్త, వైదిక బ్రాహ్మణులు , ఆలయ అర్చకులు కళానిధి శర్మ, శ్రీనివాసాచార్యులు, జితేంద్ర శర్మ పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలపై అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, జలమండలి సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 22 నుంచి 28వ తేదీ వరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పెద్దఅంబర్‌పేట్ నుంచి కుంట్లూర్ రోడ్డులోని నారాయణ ఐఏఎస్ అకాడమీ కళాశాలలో ఇంకుడు గుంతలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేస్తే భావితరాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని పొదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తన సామాజిక బాధ్యతగా వర్షపు నీటిని వడిసిపట్టాలని సూచించారు. అందుకోసం ఇంకుడు గుంతలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఇంకుడు గుంతను నిర్మించారు. నీటి వృథాను అరికట్టడం నా కర్తవ్యాన్ని తప్పక నిర్వహిస్తానని, నీటి పొదుపులో భాగస్వామిని అవుతానని, బావి తరాలకు నీటి సంరక్షణ కోసం కృషి చేస్తానని విద్యార్థులతో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి జల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. బి కృష్ణయ్య, డాక్టర్, ప్రేమ్‌కుమార్, శివారెడ్డి, ప్రణీత్‌రెడ్డి, చైతన్యరెడ్డి, భార్గవ్, సతీష్, సాయి, రఘురాం పాల్గొన్నారు.



జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు

ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

రూ. 20 లక్షలకు రూ. 50 లక్షల లాభమంటూ టోకరా

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ యాక్సిస్ ఏజెన్సీ యాప్‌ను పోలిన యాప్ రూపొందించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.20.10 లక్షలు కాజేశారు. పలు సామాజిక మాధ్యమాల్లో పార్ట్‌టైం జాబ్ యాడ్స్ చూసిన సికింద్రాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు(88) వారిని సంప్రదించాడు. సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. వెబ్‌సైట్లు చూడటం, యూ ట్యూబ్ వీడియోలు చూడటం వీటిని స్క్రీన్‌షాట్‌లు తీసి పంపితే కొంతమొత్తంలో డబ్బులు ఖాతాలో జమచేసేవారు. బ్లాక్ ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించవచ్చని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. కొంత మొత్తం ఆదాయం రావడంతో సైబర్ నేరగాళ్ల మాటలపై నమ్మకం వచ్చి వారు పంపిన లింక్ ద్వారా యాక్సిస్ ఏజెన్సీ యాప్‌ను పోలిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అధిక మొత్తంలో లాభాలు అని చెప్పడంతో రూ.20.10 లక్షలు పెట్టుబడి పెట్టి వారు సూచించిన విధంగా టాస్క్‌లు పూర్తి చేశాడు. పెట్టుబడితో కలిపి మొత్తం రూ.50 లక్షలు తన ఖాతాలో ఉన్నట్లుగా యాప్‌లో చూపించడంతో డబ్బు విత్‌డ్రా చేయాలనుకున్నాడు. నిర్వాహకులను సంప్రదించగా డబ్బు విత్‌డ్రా చేయాలంటే ఖాతాలో మొత్తానికి 30 శాతం అంటే రూ.15 లక్షలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ నిధికి డొనేషన్ చేయాలని సూచించారు. దాంతో అనుమానం వచ్చిన బాధితుడు బేగంపేటలోని యాక్సిస్ బ్యాంకు కార్యాలయంలో సంప్రదించగా, సైబర్ నేరగాళ్ల మోసం వెలుగులోకి వచ్చింది. దాంతో తనకు న్యాయం చేయాలని బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బస్సు ఎక్కబోయి... జారిపడి మహిళ మృతి

బోయినపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కాలన్న తొందరలో ఓ మహిళ జారిపడి మృతి చెందిన సంఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బాలానగర్ ప్రాంతంలోని ఫతేనగర్‌కి చెందిన లలిత (57) భర్త మధుసూదన్ కలిసి సుచిత్ర చౌరస్తా నుంచి బొల్లారంలో ఉన్న ఫంక్షన్ హాల్‌కు శుభకార్యానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ముందు ఉన్న మేడ్చల్ బస్టాప్ వద్దకు వచ్చారు. మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్లాట్ ఫారం వద్ద ఆపుతున్న క్రమంలో బస్సు ఎక్కేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు కాలు జారి బస్సు వెనుక టైర్ల కింద పడిపోయింది. బస్సు ముందుకు కదలడంతో వెనుక టైర్ల కింద పడిన లలిత అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి లలిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు వెల్లడించారు.




లలిత (ఫైల్)

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

మారేడుపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని 60 సంవత్సరాల వృద్ధుడు ఎండలకు తట్టుకోలేక మృతి చెందిన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... జేబీఎస్ వద్ద ఆర్ అండ్ డి సివిల్ ఇంజనీర్ కార్యాలయం పక్కన మెట్రో పిల్లర్ 908 వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉన్నాడని సెక్యూరిటీ గార్డు మారేడుపల్లి పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి చెరుకున్న పోలీసులు వృద్ధుడు మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సమాచారం కోసం మారేడుపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.





నృత్యాలతో సందడి చేస్తున్న విద్యార్థులు

ఓయూలో ముగిసిన జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

తార్నాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ గురువారం ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ముగిసింది. షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. అంతకు ముందు సినీ ప్రముఖుల చేత నిర్వహించిన వర్క్‌షాప్ ప్యానల్ డిస్కషన్ ద్వారా సినీ ఔత్సాహికులకు ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన షార్ట్‌ఫిల్మ్‌లకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

వాకర్స్‌ను కలిసి మద్దతు కోరిన ఈటల

రామంతాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను గురువారం ఉదయం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ కలిసి మద్దతు కోరారు. మల్కాజిగిరి ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, రామంతాపూర్ కార్పొరేటర్ శ్రీవాణి, బీజేపీ సీనియర్ నాయకులు వెంకన్నగౌడ్, రాగి లతా వెంకట్‌రెడ్డి, ఎల్లాచారి, నారాయణదాస్, అంజయ్య పటేల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సునితాశేఖర్

బీజేపీ అధికారంలో ఉంటేనే దేశాభివృద్ధి

మౌలాలి , మార్చి, 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని మౌలాలి కార్పొరేటర్ సునితా శేఖర్ యాదవ్ అన్నారు. మౌలాలీ డివిజన్‌లో మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో బీజేపీ నాయకులు మోహన్‌యాదవ్, లింగరావు, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 15న బిట్స్‌పిలానీ వర్క్ ఇంటిగ్రెటేడ్ లెర్నింగ్ అంతర్జాతీయ సదస్సు

జవహర్‌నగర్, మార్చి, 28 (ఆంధ్రజ్యోతి): బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఏప్రిల్ 15, 16 తేదీలలో 'వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్-2024' అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ విదేశాల నుంచి ప్రముఖులు, విద్యావేత్తలు, సాంకేతిక రంగాలలో నిపుణులతో పాటు భారత ప్రభుత్వ సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ సీతారామ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364